స్కెచ్

# గోతిలో గొంతుకలు

యామిజాల శంకరం

"చస్తున్నాం!" అంది ఆ చెట్టుక్రింద చేరిన మూకలో మూలనున్న మాలగొంతు.

"చావండి చస్తే సేం? దశావతారం ఎత్తిన కలిపురుషుని కత్తికి పదును లేదు. ఉంటే బీదల్ని దునుమాడితే, మనదేశం బీదదేశం కాకుండా భాగ్యవంతుల భోగాల కోటపట్టయ్యేది" అందొక గొంతు.

"ఎందుకోయ్? ఊరికే అరుస్తావ్! చావటమేం కష్టమయిన పనా! ఇట్టే చావచ్చు. చూడరాదూ? మొన్న వెంకటేశ్వర్లు చచ్చాడు. వంద రూపాయల ఉద్యోగం చేసేవాడు. ముగ్గురు కొడుకులూ, ఇద్దరు కూతుళ్ళూ వాడికి. అంతా పదిహేను సంవత్సరాలలోపు వాళ్ళే. ఇంకేముంది? ఇంటి పైకప్పెగిరిపోయింది. తల్లి బిచ్చమెత్తి పోషిస్తూ ఉండేది. ఓరోజు కర్మంచాలక ఏలూరురోడ్డుమీద లారీ క్రిందపడి చచ్చింది. ఈ రోడ్డులో నెలకొకడు చస్తూంటాడు. అందుకని ప్రజగాని ప్రభుత్వంగాని శ్రద్ధ తీసుకోదు. ఇంకేముంది చెట్టుకొకడు పుట్టకొకడయ్యారు. సంపాదించేవాడు మొదలే పోయాడు. అదిగాక సంపాదన సంసారానికే సరిపోయేది కాదు. నిల్వ ఏంచేసి చస్తాడు" అంది మరో గొంతు.

"ఐతే బిడ్డల్ని కనటం అనవసరమా?" అన్నాడు మరొకడు.

"శుద్ధ అనవసరం" అంటూ మొదలుపెట్టాడో ఆర్థిక శాస్త్రవేత్త.

"చూడండి - ఒకడో ఉద్యోగం చేస్తూ ఉంటాడు. వాడికి వచ్చేవి యాభైరూపాయిలు. వాడికి ఆరుగురో, ఏడుగురో సంతానం. వీళ్ళందరికి ఉద్యోగాలివ్వాలి ప్రభుత్వం. అంతే కాదు, వీళ్ళకు తలొక అయిదారుగురు పుట్టారనుకోండి. ఒక్క సంసారంలోనే యాభైమంది ఉద్యోగాలు కావాలంటే? ఎన్ని ఉద్యోగాలున్నాయి? అందుకనే సంతాన నిరోధం అమల్లో పెట్టాలి."

"ఐతే మా గతి చూడండి!" అందుకున్నాడో గుమాస్తా.

"నాకిచ్చేది నెలకరవై. చేసేది గాడిద చాకిరీ- తాలూకాఫీసులో. సంపాదించేది నేనొక్కణ్ణి. తినేందుకు పది మంది దాకా ఉన్నారు కొంపలో. నెలకు కనీసం 10 రోజులు ఒంటిపూట, నాలుగు రోజులు పస్తు ఉంటున్నామంటే నమ్మండి. ఇది యిలా ఉండగా రేపేదైనా రోగం రొష్టు వస్తే"

"అందుకనే సంవత్సరానికింత బోనసంటూ ఇమ్మన్నారు. దాచుకుంటే కష్ట సమయాల్లో అక్కరకు వస్తుంది" అన్నది మరో గొంతు.

గొంతు సవరించుకుంటూ నాయకుడు లేచాడు. అప్పటిదాకా అన్నీ వింటూ కూర్చున్నాడు.

"భయపడకండి! హెచ్చు కూలీ కోసం, లేకపోతే లాభాల్లో పాలు పంచమని పోరాడుదాం" అంటూ మొదలుపెట్టాడు. అంతలో—

"ఎందుకు నాయనా! బొత్తిగా బస్తీలోనే బ్రతకాలని, సినిమాలే చూడాలని, విందులు వినోదాలే కావాలంటే యెలా నాయనా!" అన్నాడో పల్లెటూరివాడా దారినపోతూ.

"ఎందుకు బాబూ! అలా అన్నావ్?" అంటూ ఆమందిని చీల్చుకుంటూ వచ్చిందో గొంతు.

"ఎందుకా? పల్లెల్లో బోలెడంత భూమి సేద్యం చేయక బీడుగా పడివుంది. తలో నాగలి కట్టి తలో ఎకరం దున్నుకో కూడదూ! వ్యవసాయంమీద యెంత మందైనా పని చేయవచ్చు, పోషింపబడవచ్చు. నలుగురికి పెట్టవచ్చు; కడుపునిండా తినవచ్చు; పైగా ఆదా చెయ్యవచ్చు. మీరు గ్రహించుకోలేకపోతున్నారు కాని, నలుగురు నాలుగు పనులు చేస్తే కరువు యెక్కడుంటుంది నాయనా! కూలీలంటే చౌకగా చూడబడుతున్నారు ఎందుచేత? అంతా ఆ పనికే ఎగబడి, బస్తీ వదలలేక. ఎప్పుడైతే మీరు బస్తీ వదిలి పల్లెలను పట్టుతారో అప్పుడు రెంటికీ విలువ చేకూరుతుంది. దేశం

సస్యశ్యామల మవుతుంది. అంతేగాని మత భేదాలు, పార్టీ విభేదాలు, అన్యోన్య కలహాలు అంతర్యుద్ధాలు, అత్యాచారాలు యెందుకు నాయనా! కాని ఒక్కటి, ఇలాంటివి పట్టణాల్లోనే గాని పల్లెల్లో పనికిరావు. ప్రాణానికే మోసం వస్తుంది. అక్కడ కష్టపడి పనిచేయాలి, పండించాలి; తినాలి. మీకు ఇష్టూ, వాకిష్టూ లేవుగా! నాతో కొంతమంది రండి? మిగతా వారు కూలీ-నాలీ, ఉద్యోగం-సద్యోగం చేస్తూ, బోనసు కోసం, లాభాల్లో పాళ్ళకు దెబ్బలాడుతారు. అప్పుడు రెండు విధాలా మంచిది."

"అమ్మో! వ్యవసాయమే! రాత్రింబవళ్లు కష్టపడాలి" అన్నదో గొంతు.

"ఉండవయ్యా! మధ్యన నీదో పిడకల నాటకం. ఇప్పుడు మేమేం మీ పల్లెల గురించి మీ వ్యవసాయం గురించి మాట్లాట్టంలేదుగా. నువ్వు కాస్త ఆ ఉపన్యాసం దంచకుండా ఉంటే ధన్యుడివి" అన్నది రెండోది.

ఇలా ఒకదాని తరువాత మరొకటి లేచాయి. అంతా అతని మాట పెడచెవిని పెట్టారు. ఆ గుంపులో నిల్వలేక పోయాడతను. చిరాకొచ్చింది. ఛీ! అనుకున్నాడు. చక్కా దారి పట్టాడు పోదామని.

"ఏం బాబూ! నీమాట ఎవరి చెవికెక్కింది? వాళ్లు రోజుకు ఎనిమిది గంటలు పనేమిటి రెండు గంటలే చేస్తామనే రకం. రాత్రింబవళ్లు కష్టపడి వ్యవసాయం చేసే దీక్ష, శ్రద్ధ, ఓపిక వారికేదీ?" అంటూ మూలనున్న హరిజనుడు ముందుకొస్తూ, పల్లెవానితో ప్రసంగించాడు.

"అంతేనా?" అన్నాడాశ్చర్యంగా.

"కాక! వీళ్లు ప్రొద్దున్నే లేచి, రెండు ఝాములదాకా నాగలి దున్ని, ఆ పైన ఎడ్లను సాయంత్రం దాకా కాచి, తెల్లవార్లూ పొలం కాస్తూ ఉండగలరా! దెబ్బకి చావరూ! వీళ్ళేం వ్యవసాయం చేస్తారు. విందులు వినోదాల కలవాటుపడ్డ దేహాలు ఘట్టి పనిచేయగలవా?"

"ఐతే వీళ్ళంతా ఎందుకు చేరారిక్కడ?"

"ఏదో సమావేశమట. ఆ పెద్ద మనిషి నిలచున్నాడు చూచావ్? అతను దీనికి నాయకుడు. అప్పుడప్పుడు వచ్చి ఇలాంటి సమావేశాలు జరుపుతూ ఉంటాడు. ఎందుకో? పలుకుబడి సంపాదించుకొనేందుకు. రేపు వోట్లు వేయించుకునేందుకు. అంతేగాని మాకేంఒరిగి ఒళ్లోబడదు.

"చూడరాదూ! సమానత్వం, సౌభ్రాతృత్వమంటూ అరుస్తున్నాడు! అతనికి ఓ యాభై ఎకరాల పొలముంది. నూరుపుట్లు పండుతాయి. తనకోసం పది పుట్లు ఉంచుకొని కడమవి మామూలు ధరకు మాకివ్వకూడదూ! ఎందుకివ్వడా? ఎందుకిస్తాడు? వాళ్ళకో ఆవుఉందనుకో పాలు పెరుగు అమ్మటమే కాదు, దాని పేడను మట్టిలో కలిపి పిడకలుచేసి అమ్ముతారు వాళ్ళ ఆడవాళ్లు. ఇక మనకు బియ్యం సరయిన ధరకిస్తాడా! వాళ్లు మాకు నాయకులు.

"ఇటు చూడు మతా లుండకూడదంటాడు. అయనే నన్నామూల కూర్చోబెట్టాడు. ఇదివరకు ముస్లిం హిందువుల తగవులాట లెరుగుదుము గాని ఇప్పుడు-హిందువుల్లో హిందువులు కొట్టుకొచస్తున్నారు. ఒకరిమాటఒకరికినచ్చదు. మత విద్వేషాలు, బ్రాహ్మణ బ్రాహ్మణేతర కీచులాటలు. ఇలాఉంటే మన ఆంధ్రదేశం ముందుకు పోవాలంటాడాయన. ఎలా పోతుంది? మొట్టమొదట యీ హెచ్చుతగ్గుల్ని సరి దిద్దమను. అసలు మతాలు మాసిపోవాలని ఎవడేడిశాడు? ఇదంతా వీళ్లు కల్పించిందే. ఏదోవిధంగా పైకి రావాలని, మంత్రిపద వలంకరించాలని. ఆయన మాటమాటకీ మాటే అంటాడుగదా ఏదీ నన్ను పంక్తిని కూర్చోబెట్టుకొని ఇంట్లో అన్నం తినమను. లేదా,ఆయన పిల్లను మాఅబ్బాయికిమ్మను. అలా కాదు. ఆయన చెప్పినట్లల్లా మేం నడుచుకోవాలి. అవన్నీ ఆచరణలో పెట్టాలి. ఆయనకు మాత్రం ఇవి వర్తించవు. ఏదో తామరాకు మీది నీటిబిందువులా, అంటీ ముట్టకుండా నాల్గు ముక్కలు చెప్పిపోతాడు. తెలియనివాళ్ళంతా నమ్ముతారు. ఇదీ ప్రపంచం.

"పద! మనం పోదాం! ఆ గోతిలో పుడ్డ గొంతుల్ని అలాగే గింజుకోనీయ్! వీళ్ళేం మంచి చెబితే వినేరకం కాదు. బస్తీలో ఉండటం, సుఖాలనుభవించటం, దానికి ప్రజాసమూహం దోహదమివ్వటం, ఇదీ కావాలి!"

అంటూ ఆ ఇద్దరూ, అస్తమిత సూర్యకిరణాలు నుదుళ్ళమీద నాట్యం చేస్తూండగా, పశ్చిమదిశగా సాగిపోయినారు.

Edited Printed and Published by KHASA SUBBA RAU, at *Swatantra Printers*, 160, Lloyds Road, Royapettah, Madras.